ఫస్ట్ యిన్‌సిషన్ – కంఠం మీద మొదటి కత్తి కోత పుస్తకాల్లో చెప్పినట్టే వచ్చింది.

❖ ❖ ❖

మనుషుల మంచితనం మీద తిరిగి నమ్మకం కుదురు తున్న దానిలా మనోబలంతోనూ, ధైర్యంతోనూ, ఆ నమ్మకం ఒకసారి పోగొట్టుకున్నందుకు చింతిస్తున్న దానిలా విచారి స్తూనూ కూర్చుంది కమల.

తోపుడు బళ్ళలో చిన్న పిల్లల్లాగా ఆవిడ కళ్ళముందే రెండు ఆక్సిజన్ సిలెండర్లు థియేటర్లోకి వెళ్ళాయి.

"నాలాటి దాని... రికార్డు... డాన్సరు... చవకబారు.. దాని కొడుక్కి కూడా దేవుడున్నాడు"

ఖరీదైన వైన్ సీసాల్లా బ్లడ్‌ప్లాస్మా సీసాలు పట్టుకొని థియే టర్లోకి పరిగెత్తింది మరో నర్సు.

"ఇంతమంది నర్సులు... ఇన్ని మందులు యింతమంచి డాక్టరు.. యిప్పుడేమైపోయినా... భగవాన్... ఏమిటీ తప్పుడు ఆలోచన.... భగవంతుడున్నాడు"

❖ ❖ ❖

ఆపరేషను పూర్తి అయిపోయింది. డాక్టర్ రెగ్గీ ఆపరేషన్ దుస్తులు విప్పకుండానే థియేటర్ బైటికి వచ్చి, తిన్నగా కమల దగ్గరికి వెళ్ళి, ఆమె భుజాల మీద అతి చనువుతో చేతులు వేసేడు.

నీ మాంగల్యం తెగిపోయింది. అని కూతురితో చెప్పవల సిన తండ్రిలా అతను కుమిలిపోతున్నాడు.

"ఐ హేవ్ డన్ మై బెస్ట్" కాని లాభం లేకపోయిందమ్మా.

❖ ❖ ❖

తర్వాత రెగ్గేనే తల్లినీ, పిల్లడినీ, రిక్షాలు కట్టించి, సింహా చలాన్ని సాయం యిచ్చి పంపించేడు.

ఆ బాబే అలా చెయ్యకపోతే – ఆమె దగ్గరున్న రెండు రూపాయలూ రిక్షాలకే అయిపోయేవి.

ఈ జరీ మొగ్గని.

ఈ కెంపుల కుప్పని,

"పాలిచ్చిన చేతుల్తోనే పాతుకోవాలి తండ్రీ!"

"మీ ధనవంతుల్లో నూటికి ఒక్కడు నీలాంటి వాడుంటే మీ అడుగుల నీడల్లో బ్రతికేస్తాను" అని మనసులోనే దీవిస్తూ ఆమె పిల్లడ్ని చేతిలోకి తీసుకొని నిలబడింది.

చచ్చిపోయిన క్రీస్తుని పట్టుకొని ఏడుస్తున్న మేరీలా వుందామె.

"వస్తాను బాబూ" కృతజ్ఞతతో నిండిపోయిన గుండె అన నివ్వలేదు.

❖ ❖ ❖

"అదుగో తోక అంటే యిదుగో పులి అనే ఈ బేడా పరక పత్రిక వెధవలున్నారే. అసలు పులి దొరికితే వదిలేస్తారా? ఈ పాటికి నా మానం బజార్లో అమ్మేసి వుందురు, రెగ్గీ కాపాడి వుండకపోతే –" అన్నాడు మేత్యూ.

"దానికేముందిలే"–తన టెరీపూల్ పేంటు మీద పడిన చిప్స్ ముక్కని ఎడమచేతి చూపుడువేల్తో మీటుతూ అన్నాడు రెగ్గీ.

"యింతకీ ఈ పార్టీ దేనికి?"

రెగ్గీకి, ఎ మిలియన్ థ్యాంక్స్ పర్ ది పీ.యమ్. కృతజ్ఞ తలు తెల్పేడు మేత్యూ.

"అంటే?" కంట్రాక్టరు ఆశ్చర్యపోయేడు.

పి.యమ్ అంటే పోస్టుమార్టమ్.

"అంటే!!" కంట్రాక్టరు యింకా ఆశ్చర్యపోయేడు.

"అంటే బెంచీమీదే కునికేసేడు కుర్రవెధవ అని"

**(1971)**

# నువ్వు యిచ్చిన నాన్న

"**దీ**పంలా వున్నావ్. నీకిందే ఖర్మో?"

నశీం నవ్వింది. నీరసంగా, నిరాశగా, అసహజంగా ఆనందం లేని నవ్వు. ఆకాశంలోకి చూసి, కళ్ళు మూసుకొని అల్లాని తలుచుకొని, మళ్ళీ కళ్లు విప్పేసరికి చుట్టూ ఉన్న జనం ఆశతో, ఆనందంతో ఆమెని చూసేరు.

"దేఖో బాబా... ఇతనీ ఛోటీ బచ్చీ...." బాబా తర్వాత మాటలు తాతడోలు శబ్దంలో వినిపించలేదు.

అసలు నశీం సహజంగా – బలంగా – ఆనందంగా – మంచు కొండల మీద వెన్నెల జల్లులా నవ్వగలదు. ఆమె ఎప్పుడూ

అలాగే నవ్వుతుంది. అలా నవ్వడానికే ఆమె పుట్టినట్లు ఉంటుంది. నవ్వి నవ్వి ఇక నవ్వలేక బొమ్మలా విరిగి పోతుందేమో ననిపించే వరకు నవ్వగలదు.

తను చేసే ఫీట్సుకి జనం ఆనందంతో, ఉత్సాహంతో ఈలలు వేసినప్పుడు ఆమె దిగమింగిన నవ్వుకళ్ళను బద్దలు చేసుకొని బైటపడుతుంది.

పాముల దాదా జానెడు నాగుపాముని పట్టుకు వచ్చిననాడూ – తన కోడి పొదిగిన దూదిపిల్లల్ని చేతుల్లోకి తీసుకున్నప్పుడూ – తన వేపు ఎవరేనా ధర్మాత్ముడు పది పైసలు విసిరిననాడూ – పువ్వులు విడినప్పుడు – మబ్బులు పోయినప్పుడు – ఆమె మితిలేని ఆనందంతో పిచ్చిగంతులు వేస్తుంది.

ఆమెకు కొంతమంది మనుషులూ, కొన్ని పరిస్థితులూ గుర్తు వచ్చినప్పుడు ఆకాశంలోకి ఎగిరిపోవాలనిపిస్తుంది. ఆర్నెల్ల కిందటో – మూడేళ్ళ కిందటో – ఏదో పల్లెలో తోటలో ఆమె పరి వారం ప్రోగ్రాం యిచ్చేరు. చిక్కటి చెట్లతో సముద్రం అంత తోట ఎంతో చక్కగా ఉంది.

దాని నీడ ఆకుపచ్చ చీకటిలా ఉంది. దాని మధ్య మూడం తస్థుల మేడ–ఆకాశంలోంచి చూస్తే పచ్చ సరస్సు మధ్య దేవా లయంలా ఉంది. ప్రోగ్రాం ఆ యింటి ముందే జరిగింది. ఎవరో మొగాళ్ళూ, పిల్లలూ ఇంటిముందు కుర్చీలు వేసుకొని ప్రోగ్రాం చూసేరు. కాని నశీంను ఆకర్షించిన మనిషి మేడ లేసుజాలు దగ్గర నుంచి చూస్తున్న ఆడవాళ్ళలో మధ్య కూర్చున్న పెద్దావిడ ప్రోగ్రాం అయిపోయేక ఆవిడ నశీంను లోపలికి పిలిపించింది.

సింహాసనం అంత కుర్చీలో నిండుగా ముసిలిరాణిలా ఉంది ఆమె.

ఆమె కట్టుకున్న పట్టుచీర ఆమె చర్మం అంత మృదువుగా లేదు.

నెరసిన ఆమె జుత్తు వెండి జరీలా మెరుస్తోంది.

ఆమె నుదుట కుంకుంబొట్టు నూరేళ్ళు మొగ్గగా ఉండి విడిన కెంపుల పువ్వులా ఉంది.

ఆమె నడుముని చుట్టుకున్న వడ్డాణం బంగారం పాములా వున్నా పాములక్కూడా ఆశ్రయం ఇచ్చే మంచి మనిషిలా ఉంది.

ఆమె వజ్రాల దుద్దులు కాంతులు కత్తుల్ని విసురు తున్నాయి.

ఆవిడ ముఖ్మల్ మనిషిలా అతి దర్జాగానూ, మంచి మనిషిలా అతి శాంతంగానూ ఉంది.

దీపంలా ఉన్నావ్. నీకిదేం ఖర్మో? అనో, యింకేవో అనో ఆమె నశీంను దగ్గరకు పిలిచింది. దేవుడు దగ్గరకు వెళ్ళడానికి భయపడినట్టు నశీం భయపడింది. ఉండు అంటూ ఆమె లోప లికి వెళ్ళి పట్టుపరికిణీ, కొత్త కరెన్సీ నోటూ నశీం చేతిలో పెట్టింది.

ప్రోగ్రాంలో ఆవిడిచ్చిన పరికిణీ అమ్మ కట్టుకోనివ్వదు. ఎప్పుడూ సల్వార్ కమీజుకట్టుకోమంటుంది. ఆ పరికిణి ఎంత బావుంటుందో అమ్మకేం తెలుసు.

నశీంకు తరచు గుర్తుకొచ్చేది – మరో దొరల కుటుంబం

అప్పుడెప్పుడో ఏదో సాయంత్రం ఏదో ఊళ్ళో సముద్రపు ఒడ్డున ప్రోగ్రాం జరుగుతోంది. మొదట్లో రోజూ చూసే జనమే చూస్తున్నారు. ఇంతలో ఎక్కడి నుంచో వచ్చేరు ఒక దొర. దొర సాని, యిద్దరు పిల్లలు.

దొర టెరిలిన్ సూటులో టెరిలిన్ పాములా ఉన్నాడు.

ముట్టుకుంటే మాసిపోయేటట్టుంది దొరసాని.

పట్టుకుంటే కందిపోయేట్టున్నారు పిల్లలు.

ప్రోగ్రాం అయిపోయేక వాళ్ళు నశీంని పిలిచేరు. దొరసాని ఆమె బుగ్గలు నిమిరింది. దొర ఆమెను భుజాల మీద ఎక్కించు కున్నాడు. ఆ తర్వాత వాళ్ళు నశీంతోఎన్నో ఫోటోలు తీయిం చుకున్నారు. నశీంకు అయిదు రూపాయలదో పదిరూపాయలదో నోటు యిచ్చి పంపేసేరు.

కాని ఒక్క ఫోటో కూడా యివ్వలేదు.

నోటు పెట్టి ఊళ్ళో ఫోటో తీయించుకుంటా నంది నశీం. సరేనంది అమ్మ. కాని ఫోటో వద్దని బాబా నోటు తీసుకున్నాడు. బాబాని కసిరింది అమ్మ. అమ్మని కొట్టేడు బాబా.

అమ్మ ఏడ్చింది.

నశీం ఫోటో వద్దని ఏడ్చింది.

దొరవాళ్ళు ఇప్పుడెక్కడ వున్నారో? వాళ్ళ ఊరు చంద మామంత దూరంట. వాళ్ళు జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నశీంకి కడుపు నిండిపోతుంది.

నశీంకు జ్ఞాపకమొచ్చేవి అన్నీ మంచి జ్ఞాపకాలే కావు. కొన్ని కొన్ని సంఘటనలు గుర్తుకొస్తే విషవృక్షపు ఊడల్లో చిక్కు కొని పోయినట్టు పీడకలలు నిజమైపోయినట్టు ఆమె వణికి పోతుంది.

అప్పుడెప్పుడో వర్షం విషపు ధారలా నల్లగా పడుతోంది. చీకటి గుడిసెలో అమ్మ అంటించిన పొయ్యి మంటలు నిప్పు పాముల్లా లేస్తున్నాయి. మూలను తాగి పడుతున్న 'బాబా' ముసిలి మూటలా వున్నాడు. అప్పుడు నశీం బాగా చిన్న పిల్ల.

బయట ఆకాశం బద్దలౌతోందో, భూమి బద్దలౌతోందో తెలీనంత పిడుగుల చప్పుడు. గుడిసెను ఎగరగొట్టే పెనుగాలి.

ఇంటి పంచని ముసిలికుక్క చలికి ముడిచేసుకుపో తోంది. ఊళ్ళో ఎలక్ట్రిసిటీ పోవడం వల్లా ఊరంతా చీకటి సము ద్రంలో మునిగిపోయింది.

బయట చీకటి గుహల రాతి చీకటిలా గుడిసెని చుట్టు కుంది.

భయంతో కళ్ళు మూసుకునేలోగా నశీంకు కనిపించిం దల్లా కదుల్తున్న కాకీ బట్టలు – తోలు బెల్టుల బకిల్స్ మెరుపులు. నశీం కళ్ళు విప్పేసరికి పోలీసులు లేరు. బాబా కూడా లేడు. అతను తిరిగి వచ్చేసరికి పోల్చుకోలేనంత మారిపోయేడు. తన చిన్ననాటి జబ్బు ఫోటోలా ఉన్నాడు అతను.

అప్పట్నించి నశీంకు పోలీసులంటే భయం. వాళ్ళని తల్చుకుంటే కడుపులో ఏదో తెగిపోయినట్టుంటుంది.

అలాగే మరో చీకటి రాత్రి .........

నశీం అప్పటికి యింకా చాలా చిన్నపిల్ల. మంచం మీద లేని అమ్మ మూలగలేకపోతోంది. ఎవరో ఆడవాళ్ళు దేవుళ్ళకి దణ్ణాలు పెడుతున్నారు. అంతవరకూ మంచం దండేన్ని గట్టిగా పట్టుకున్న అమ్మ చెయ్యి పట్టుతప్పి చచ్చిపోయినట్టు వేలాడు తోంది.

తరువాత రిక్షాలో ఎవరోతల్లి ఒడిలో తెలివి తప్పిన అమ్మ – తనని ఎత్తుకొని పరిగెడుతున్న నాన్న చీకట్లో, మనిషిలా కాకుండా ఏదో భారీ జంతువులా ఉండడం, ఆస్పత్రిలో నర్సుల యూనిఫారాలా కాగితాల చప్పుడు–మొహాలు కప్పుకున్న డాక్టర్ల భయంకరమైన ముసుగులు–మోకాళ్ళ మీద తలపెట్టుకున్న బాబా వినిపించని ఏడుపు–ఎవరో వచ్చి అమ్మ కడుపు కోసేస్తా రుట అన్నారు.

నశీం బాబాని చుట్టుకొని పోయి భయంతో వణికి పోయింది. మళ్ళా ఆమెకు తెలివి వచ్చేసరికి తమ్ముడు పుట్టేడ న్నాడు. ఆ తర్వాతన అమ్మ ఆటకు పనికిరాకుండా పోయింది. అప్పట్నుంచీ నశీంకు డాక్టర్లంటే పిచ్చి భయం.

నశీం ఎప్పుడూ మర్చిపోలేని సంఘటన. ఆవేళ తమ్ముడు నజీర్‌కి 'విద్య' ముప్పాలన్నాడు బాబా. 'చిన్న పిల్లదు యిప్పు డప్పుడే ఒద్దు' అంది అమ్మ. విద్య చిన్నప్పుడే ముప్పాలి అన్నాడు బాబా. 'యింకా మూడేళ్ళయినా వెళ్ళలేదు. నే నొప్పుకోను' అని అమ్మ నజీరుని కడుపులో దాచుకుంది. పిల్లడ్ని వదల మన్నాడు బాబా. వదల్లేదు అమ్మ. అమ్మని బాబా బాదేడు. నజీరుని బలవంతంగా లాక్కుని విద్య నేర్పటం మొదలుపెట్టేడు. భయంతో వణికిపోతున్న నజీరుకి కాళ్ళూ చేతులూ లొంగడం లేదు. మొదటి పాఠాల్లోనే అతని కాలు విరిగిపోయింది. అప్పుడే బాబానే ఏవో కట్లు కట్టేడు. కాని, అప్పట్నుంచి నజీరు కాలు విరిగిన కర్రలాగే ఉండిపోయింది.

ఇప్పుడు వీటన్నిటికంటే బాధపెడుతున్న సంఘటన నిన్న రాత్రిది.

నిన్నరాత్రి... గుడిసె ముందు గబ్బిలాల చెట్టు కింద ఈత చాప మీద నశీం నిద్రపోయింది. నిద్రపోయిన నశీంకి అమ్మ ఏడుపుతో తెలివి వచ్చింది. అమ్మ పక్కనే బాబా ఏం పర్వాలేదు అంటూ అమ్మతో ఏదో చెప్తున్నాడు. పిల్ల ముందుకు రావాలంటే యిదే మార్గం అంటున్నాడు. అతని పక్కనే ఎవరో పువ్వుల లుంగీల వాళ్ళూ, గళ్ళ చొక్కాల వాళ్ళూ నలుగురున్నారు. వాళ్ళ మాటలు వింటే నశీంకి అర్థమైన విషయం తనని సర్కస్ కంపెనీకి యిచ్చేస్తాడట బాబా. రేపు తన ఆట చూడ్డానికి వస్తా రట. పువ్వుల లుంగీల వాళ్ళు భయంతో కదలలేని నశీంకు భయంవల్ల నిద్ర పట్టేసింది.

ఈ వేళ పొద్దునే లేచినప్పుడు రాత్రి జరిగిన విషయం కలే మోనని ఆశపడింది నశీం.

అది కల కాదనడానికే అన్నట్ట గుంపు చివర గళ్ళ లాల్చీలు వాళ్ళు కనిపించేరు. గెడ ఎక్కిన దొమ్మరి నశీంకు పన్నెండు అడుగుల గెడ బాబా భుజం మీద నిలబడింది. గెడ చివర గిరగిరా మొగ్గలు వేస్తున్న నశీంకు ప్రపంచం అంతా తిరుగుతూ కనిపించింది.

మొగ్గలేసే బొమ్మలా యాంత్రికంగా విద్య చేస్తున్న ఆమెకు "దేఖోబాబా యితనీ ఛోటీ బచ్చీ" అన్న బాబా అరుపులు, వాయి స్తున్న డోలూ వినిపించడం లేదు.

ఆమె ఆకస్మాత్తుగా అమ్మచల్లని కడుపు – నాన్న వెచ్చని నీడా వదిలి ఈ సర్కస్ కంపెనీలోకిఎలా వెళ్ళిపోవడం?

అప్పుడామెకు కనిపించినవి - బంగారు పాములా కెంపు కళ్ళ ఎర్రదనం-కరెన్సీ నోట్ల పచ్చదనం, పోలీసు బెల్టుల బకిల్సు మెరుపులూ-కోసిన కడుపులో కిరకిర తిరిగే రక్తపు పేగులు.

పిచ్చిగా ఆట ఆడింది నశీం.

ఆట అయ్యేసరికి ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి. ఆట ఆఖరున ఆమె గెడ చివర నుంచి బాబా చేతుల్లోకి గెంతాలి. అలా కొన్ని వేలసార్లు గెంతింది.

కాని యిప్పుడు నీళ్ళు నిండిన కళ్ళకి చేతులు చాపిన ఇద్దరు నాన్నలు కనిపించేరు.

పకడో అని అరిచి గెంతేసింది. ఎనిమిదేళ్ళ నశీం.

కింద ఇద్దరు నాన్నల్లో ఒకడు దేవుడిచ్చిన నాన్న, రెండో వాడు మీరూ నేనూ యిచ్చిన నాన్న.

ఆమె ఏ తండ్రి చేతుల్లో పడుతుంది?

**(1971)**

# పాత కథే

**"మ**నిషివంక మహాలక్ష్మి తీరుస్తుంది"

అవతార పురుషులకీ, మహాత్ములకీ కొన్ని నియమాలు, ప్రతిజ్ఞలూ వుంటాయి. శ్రీరాముడు ఎప్పుడూ తండ్రి మాట జవదాటలేదు. కర్ణుడు ఎప్పుడు అడిగిన వాడికి లేదన్లేదు.

అయితే ప్రతిజ్ఞలు, నియమాలూ కేవలం అవతార పురుషులకే వుంటాయనీ, మన్లాంటి మామూలు మనుష్యులకి వుండవనీ, వుండకూడదనీ అనుకోవడం శుద్ధ తెలివితక్కువ. అబ్సల్యూట్ ఇడియసీ.

మా అమ్మ వారానికి మూడు రాత్రులు భోం చెయ్యదు. మా చిన్ని ఎప్పుడూ హోంవరక్కు చెయ్యదు. వాళ్ళ మేష్టారెప్పుడు పాఠం చెప్పదు. మా ఎదురింటి ఇంజనీరు కూతురు పైటా, కాలూ రెండూ ఎప్పుడూ నిలవ్వు. యివన్నీ వారి వారి ప్రతిజ్ఞలే. అయితే యిందులో ఒక చిన్న గమ్మత్తుంది. మహాత్ములకైతే ప్రతిజ్ఞలంటారు. మామూలు వాళ్ళకైతే అలవాట్లంటారు.

మావూరి మేష్ట్రీటుగారు అవతార పురుషులు కారు. అలాగని పాపం ఆయనెప్పుడూ ఎరితోనూ అన్నట్టు కూడా ఎవరూ అన్లేదు. "ఐయామ్ జస్ట్ యాన్ ఆర్డినరీ మేన్ అంటారు" డబ్బు తీసుకోకుండా న్యూసెన్స్ కేసులో కూడా జడ్జిమెంటు చెప్పరు. ఇది వారి భీషణ ప్రతిజ్ఞ. ఆ ప్రతిజ్ఞ నిలబెట్టుకోవడంలో వారే హరిశ్చంద్రుడికీ తీసిపోరు. వారికీ, హరిశ్చంద్రుడికీ తేడా ఒక్కటే. హరిశ్చంద్రుడు తన ప్రతిజ్ఞ వల్ల తను నాశనం ఐపోయేడు. వీరు ప్రజని సర్వనాశనం చేస్తున్నారు. (అది వాళ్ళ ఖర్మ. తనేం చేస్తాడు? కోర్టుకి రండి బాబ్బాబు అని తనేవైనా బతిమాలేడా? కోర్టు కెక్కినవాడు, గాడిదెక్కినవాడూ ఒకటేనని వాళ్ళకి మాత్రం తెలియదూ).

బావున్నా, బాగులేకపోయినా, ప్రతి సినిమా ఫస్టుడే ఫస్టు షోకి వెళ్ళకపోతే నాకేవిటో పిచ్చెకుతుంది బాబు అంటుంది, రేసుగుర్రాల్లా ఎదిగున్న మేష్ట్రీటుగారి మొదటి ముగ్గురిలో మొదటిది. ఆ అమ్మాయి కింకా పిచ్చెక్క లేదు.

ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోదు మా డాడీ. ఒక కారు కొనమంటే. కారు లేకపోతే కాలు కిందపెట్టాలంటే నాకు మహ చెడ్డ చిరాకేస్తుంది సుమండీ. అంటుంది రెండోది.

వాళ్ళెప్పుడూ నడిచి గాని, రిక్షాలోగాని ఎక్కడికి వెళ్ళలేదు. అలాగని ఎప్పుడూ ఇంట్లోనూ ఉండరు.

కాకి పిల్లచేత కబురు పెడితే కారు తీసుకొచ్చి గుమ్మంలో పెడతాడు టు. టౌన్, ఎస్.ఐ. స్వంతకారుంటే వుండే కష్టాలు వీళ్ళకేం తెలుసు? వుమెన్ ఆర్ బార్న్ యిడియట్స్ అనుకుంటారు మేష్ట్రీటు గారు.

అలాగని వారికి పిల్లలంటే యిష్టం లేదనుకోవడం మహా పాపం. అయిదుగురూ ఆడపిల్లలే అయినా వారికి పిల్లలంటే తగని గర్వం. అంతులేని ఆపేక్ష.

"ఆడముండకి ఆల్ జీబ్రా ఎందుకండీ? అంట్లు తోవడం రావాలి గాని" అని ఆయన అభిప్రాయం. అంచేత తన పిల్లలెవర్నీ ఎస్.ఎస్.ఎల్.సి. దాటి చదివించలేదాయన. కాని మా రెండోదుంది చూసేరూ? ఏం తెలివండి? షి ఈజ్ ఎన్ అప్ ఎండ్ కమింగ్ రైటర్. ఈ మధ్య "మగవాళ్ళూ మొండితనం" "పిల్లల్ని కనకపోవడం కంటే పెంచడం" "ఇల్లు సర్దడంలో ఇరవై చిటకాలు" "ఆడవాళ్ళూ - అబద్దాలు" ఇంకా ఏవేవో చాలా ఆర్టికల్స్ పత్రికల్లో రాసింది. ఈ మధ్యే ఒక నవల, మూడు కథలు ప్రారంభించింది. ఏమ్మా! ఎప్పటికైనా సినీమాకి రాయాలని కదూ నీ యాంబిషన్? ఎంకరేజ్ చెయ్యాలండీ, మనం